సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం | 30 | ఏప్రిల్ | 2023



బైక్ భద్రం బ్రదరూ!

ట్రైసిటీలో ఇళ్లు, వ్యాపార సముదాయాలు, ఆస్పత్రులు, రెస్టారెంట్లు, రద్దీ ప్రాంతాల్లో ఎక్కువగా వాహన చోరీలు జరుగుతున్నాయి.

- 6లో▸



నిరంతర అధ్యయనం జరగాలి

దౌత్య సంబంధాలపై నిరంతరం అధ్యయనం జరగాలని పీవీ నర్సింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ సురభివాణిదేవి అన్నారు.

- 6లో▸

గరిష్టం/కనిష్టం
34^0 /24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రి సమయంలో చిరు జల్లులతో పాటు అక్కడక్కడా భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

కొత్త హంగులు

- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పీఎంశ్రీ
- కార్పొరేట్ తరహాలో బోధనకు చర్యలు
- జిల్లాలో ఆరు పాఠశాలలు ఎంపిక
- ఒక్కో పాఠశాలకు రూ.45లక్షల నుంచి రూ.2కోట్ల వరకు కేటాయింపు



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన టేకుమట్ల జెడ్పీహెచ్ఎస్

కాటారం: అరకొర వసతులతో కాలం వెల్లదీస్తున్న సర్కారు బడులకు కొత్త హంగులు సంతరించుకోనున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్ది నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇందుకోసం ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకానికి శ్రీకారం చుట్టింది. పథకం కింద జిల్లాలో ఆరు ప్రభుత్వ పాఠశాలలు ఎంపికయ్యాయి. ఒక్కో పాఠశాలకు రూ.45లక్షల నుంచి రూ.2కోట్ల వరకు నిధులు రానున్నట్లు విద్యాశాఖ అధికారులు చెప్పుకొస్తున్నారు. పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు సైతం నిర్వహించనున్నారు.

జిల్లాలో ఆరు పాఠశాలలు ఎంపిక..

ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. యూడైస్ ప్రకారం జిల్లాలో 20పాఠశాలలను ఈ పథకానికి అర్హత కలిగిన వాటిగా గుర్తించగా ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. పాఠశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రశ్నావలి రూపంలో పొందుపర్చారు. పలు పాఠశాలల వివరాలను డీఈఓలు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు పంపించగా ఇందులో నుంచి 12పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపికచేసి కేంద్రానికి నివేదించింది. కేంద్ర ప్రభుత్వం జిల్లాలోని ఆరు పాఠశాలల్లో ఈ పథకం అమలుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలో 11 మండలాలు ఉండగా ఆరు మండలాల నుంచి ఆరు పాఠశాలలు మాత్రమే ఎంపికయ్యాయి.

పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలు..
జెడ్పీహెచ్ఎస్ - టేకుమట్ల
జెడ్పీహెచ్ఎస్ - కాళేశ్వరం
జెడ్పీహెచ్ఎస్ - గొల్లబుద్దారం
జెడ్పీహెచ్ఎస్ - చెల్పూర్
టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ - చిట్యాల
మోడల్ పాఠశాల - మల్హర్

విడుదల కానున్న నిధులు..

పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.45లక్షల నుంచి రూ.2కోట్ల వరకు నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించనుంది. సంప్రదాయ పద్ధతిలో బడితోట పెంపకం, విద్యార్థులకు ఆకుకూరలు, కూరగాయలు స్థానికంగా పండించి వాటితోనే భోజనం అందించేలా చర్యలు చేపడుతారు. ఆధునిక బోధన పద్ధతులను అవలంబించడం, కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్, గణితం ల్యాబ్‌లు, ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ, జాతీయ నూతన విద్యావిధానం అమలయ్యేలా చర్యలు చేపట్టడం, ప్రహరీ, అదనపు తరగతి గదులు, డిజిటల్ లైబ్రరీ, స్మార్ట్ క్లాస్‌రూంలు, క్రీడా మైదానం, పరికరాల ఏర్పాటు తదితర సౌకర్యాలు కల్పించనున్నారు.

కార్పొరేట్ తరహాలో మార్పు..



పీఎంశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో మార్పు చోటుచేసుకోనుంది. మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యాప్రమాణాలు మెరుగుపడుతాయి. పీఎంశ్రీ కింద 20 పాఠశాలలకు ప్రతిపాదనలు పంపించగా ఆరు పాఠశాలలు ఎంపికయ్యాయి. పథకానికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు ఇంకా అందలేదు. యూడైస్ ప్రకారం ఈ పాఠశాలలను ఎంపిక చేశారు. పాఠశాలల అభివృద్ధికి ఈ పథకం ఎంతగానో తోడ్పడనుంది.

- రాంకుమార్, డీఈఓ

జిల్లాలోని పాఠశాలల వివరాలు..	ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత పాఠశాలలు	ఉన్నత పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య (2022-23)
	317	44	69	46,164

న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కాటారం: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాటారం ఎస్సై శ్రీనివాస్ అన్నారు. కాటారం మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. రోజురోజుకు ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయని, అపరిచిత వ్యక్తులు, అపరిచిత సందేశాలను నమ్మవద్దని ఎస్సై సూచించారు. సోషల్ మీడియాలో లోన్, లాటరీ పేరిట వచ్చే మెసేజ్‌లకు ఆశపడవద్దని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వెంకటేశ్, లక్ష్మిరాజం, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

భూపాలపల్లి అర్బన్: ఆరో తరగతి విద్యార్థులకు శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాంకుమార్ తెలిపారు. జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా 411మంది విద్యార్థులకు గాను 370మంది విద్యార్థులు హాజరుకాగా 41మంది గైరాజరైనట్లు తెలిపారు.

రెండో రోజు దీక్షలు



భూపాలపల్లి రూరల్: తమను రెగ్యులర్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన దీక్షలు శనివారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. భూపాలపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలను ఉద్దేశించి ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు మాట్లాడారు. ప్రభుత్వం తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. డిమాండ్లు సాధించే వరకు దీక్షలు ఆపేది లేదన్నారు. ఈ దీక్షలకు సీనియర్ కార్యదర్శులు సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో మండలంలోని అన్ని గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



చిట్యాల: మండలంలోని లక్ష్మీపూర్ తండా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ శైలజ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీచర్, ఆయాలకు పలు సూచనలు చేశారు. సమయపాలన పాటించాలని, మెనూ ప్రకారం పిల్లలకు, తల్లులకు భోజనం పెట్టాలన్నారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలన్నీ సిలబస్ ప్రకారం చేయించి హాజరు శాతాన్ని పెంచాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అలివేలు మంగ, రజిత పాల్గొన్నారు.

అగ్రి లీగల్ క్లినిక్‌తో భూ సమస్యల పరిష్కారం



మొగుళ్లపల్లి : అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా రైతుల భూ సమస్యలు, వ్యవసాయానికి సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించుకోవచ్చని జిల్లా జడ్జి నారాయణబాబు అన్నారు. మండలకేంద్రంలో శనివారం రైతువేదికలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలు పరిష్కరించుకోవచ్చని సూచించారు. దేశానికి అన్నంపెట్టే అన్నదాతలను అందరూ గౌరవించాలన్నారు. ప్రస్తుత సమాజంలో వ్యవసాయమే ముఖ్య ఆధారమని చెప్పారు. ఈ క్లినిక్‌లో వ్యవసాయరంగ సమస్యలకు న్యాయపరమైన సూచనలు, సలహాలు ఉచితంగా పొందవచ్చని అన్నారు. ఈ క్లినిక్ కోసం పారాలీగల్ వాలంటర్లను నియమిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి, శ్రీనివాస్, ఆనందరావు, మండల వ్యవసాయశాఖ అధికారి సురేందర్‌రెడ్డి, ఎస్సై శ్రీధర్, ఏఈఓలు నాగరాజు, శ్రీకాంత్ జ్యోత్న్న, యోగిత, ప్రవళిక, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భద్రాచలం రాములోరి తలంబ్రాల వితరణ



భక్తులకు తలంబ్రాలు అందజేస్తున్న అంజలి ప్రకాశ్ దంపతులు

కాటారం: శ్రీరామనవమిని పురస్కరించుకొని భద్రాచలంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణంలో వినియోగించిన తలంబ్రాలను శనివారం మండల కేంద్రంలోని శ్రీ ఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో పడకంటి అంజలి ప్రకాశ్ దంపతులు భక్తులకు పంపిణీ చేశారు. అంతకుముందు కాటారం భక్తాంజనేయ స్వామి ఆలయంలో పురోహితులు నిఖిల్‌శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప ఆలయంలో సుమారు వంద మంది భక్తులకు స్వామి వారి తలంబ్రాల ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లాడి శ్రీనివాస్, అనంతుల రమేశ్, ఏపూరి శ్రీనివాస్, ఈర్నాల సుమన్, సమ్మయ్య, నవీన్‌గౌడ్, కృష్ణ, నరేశ్ పాల్గొన్నారు.

పనులను త్వరితగతిన పూర్తిచేయాలి



పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి

చిట్యాల: మండలంలోని పలు పాఠశాలల్లో చేపడుతున్న పనులను కాంట్రాక్టర్లు త్వరితగతిన పూర్తిచేయాలని జెడ్పీ సీఈఓ ఎల్.విజయలక్ష్మి కోరారు. శనివారం మండలంలోని జూకల్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో చేపట్టిన పనులను పర్యవేక్షించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ, మనఊరు మనబడికి సంబంధించి అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటుచేశారు. మండలంలో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయించే బాధ్యత మండల అధికారులపై ఉందన్నారు. ఆమెవెంట ఎంపీపీ దావు వినోద, ఎంపీడీఓ రామయ్య, పీఆర్ ఏఈ రవికుమార్, ఏపీఓ హలీం పాషా, ఎంపీఓ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: తరతరాలుగా సంచారజీవితం గడుపుతూ.. విద్య, ఉద్యోగ, సామాజిక, రాజకీయ రంగాలలో వెనుకబడిన వడ్డెరలను బీసీ జాబితాలో నుంచి షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు గుంజస్వామి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా వడ్డెర కుల వృత్తులు (మట్టి పనులు) రోజురోజుకూ అంతరించిపోవడంతో వడ్డెరలు పనులులేక పస్తులుంటున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. ఆకలితో అలమటిస్తున్న వడ్డెరలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.2లక్షల రుణం ఇప్పించాలని కోరారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి, నాయకులు రాజన్న, సురేందర్, రమేష్, శ్రీను, కొమురమ్మ, రాజేశం పాల్గొన్నారు.

నైపుణ్యతను వెలికితీసేందుకే సమ్మర్ క్యాంపులు

- ఐటీడీఏ పీఓ అంకిత్



విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ అంకిత్

కాటారం: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యతను వెలికితీసేందుకు సమ్మర్ క్యాంపులు ఎంతగానో ఉపయోగపడుతాయని ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. కాటారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల సంక్షేమ బాలుర, బాలికల కళాశాలల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను శనివారం పీఓ పరిశీలించారు. బాలికల కళాశాల క్యాంపు, బాలుర కళాశాల క్యాంపులో విద్యార్థుల హాజరు, వారి వివరాల గురించి పీఓ కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. బాలికల శిబిరంలో 200మంది శిక్షణ పొందుతుండగా బ్రైటర్ మైండ్స్, వెస్ట్రన్ డ్యాన్స్, లైఫ్‌స్కిల్స్, ఫన్ సైన్స్ అంశాలపై కోచింగ్ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ లలితాదేవి వివరించారు. బాలుర కళాశాలలో 90మంది విద్యార్థులకు హ్యాండ్‌బాల్ కోచింగ్ అందజేస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. రెండు కళాశాలల్లోని టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ హాజరు రిజిస్టర్లను పీఓ తనిఖీ చేశారు. కిచెన్‌షెడ్‌లను పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని, పరిశుభ్రత సక్రమంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి నాణ్యమైన శిక్షణ అందించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్యాంపులో అందిస్తున్న శిక్షణ, ప్రాక్టీస్, కోచ్‌ల గురించి ఆరాతీశారు. క్రమశిక్షణతో పలు అంశాలపై శిక్షణ పొందాలని తెలిపారు. శిక్షణ ద్వారా కమ్యూనికేషన్, నాయకత్వ లక్షణాలు మెరుగుపడుతాయని అన్నారు. క్యాంపు పూర్తయిన తర్వాత ఇళ్లలో కూడా శిక్షణ పొందిన అంశాలను ప్రాక్టీస్ చేయాలని సూచించారు. పీఓ వెంట వైస్ ప్రిన్సిపాల్ సిరిసిల్ల శ్రీనివాస్ ఉన్నారు.

ఐదుగురు నకిలీ మావోయిస్టుల అరెస్ట్

- ఇద్దరు సర్పంచ్‌లను డబ్బులు డిమాండ్
- లెటర్ ప్యాడ్‌లు చూపించి బొమ్మ పిస్టళ్లతో బెదిరింపులు
- పట్టుకున్న పోలీసులు



నిందితుల అరెస్ట్ చూపించిన అనంతరం వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సురేందర్‌రెడ్డి

భూపాలపల్లి: మావోయిస్టుల పేరిట లెటర్ ప్యాడ్‌లు చూపించి బొమ్మ పిస్టళ్లతో ప్రజాప్రతినిధులను బెదిరించిన ఐదుగురు నకిలీ మావోయిస్టులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి జిల్లా పోలీస్ కార్యాలయంలో అరెస్ట్ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఎస్పీ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామానికి చెందిన వావిళ్ల జనార్దన్ 1989నుంచి 1992వరకు మావోయిస్టు ఉద్యమంలో పనిచేశాడు. పలుమార్లు పోలీసులకు పట్టుబడి జైలుజీవితం గడిపాడు. మళ్లీ బయటికి వచ్చి తిరిగి దళంలో చేరాడు. చివరగా 2016 సంవత్సరంలో భూపాలపల్లి ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. భూపాలపల్లి పట్టణంలోని కారల్‌మార్క్స్‌కాలనీలోనే నివాసం ఉంటూ ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే మాజీ మావోయిస్టులైన భూపాలపల్లి మండలం ఆజంనగర్‌కు చెందిన పులిగంటి సతీష్, బీరెల్లి నర్సయ్యలు జనార్దన్‌కు పరిచయమయ్యారు. ఈ ముగ్గురికి జనార్దన్ ఇంటి పక్కనే నివాసం ఉండే అల్లెం సమ్మయ్య, ములుగు జిల్లా బండారుపల్లికి చెందిన పెండెం రాజేంద్రప్రసాద్ (జనార్దన్ బంధువు) కలిశారు. ఐదుగురు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో ఎలాగైనా డబ్బులు సంపాదించాలని నిశ్చయించుకున్నారు. మావోయిస్టుల టార్గెట్ అయిన కాళేశ్వరం సర్పంచ్ వెన్నపురెడ్డి వసంత భర్త మోహన్‌రెడ్డి, భూపాలపల్లి మండలం నాగారం సర్పంచ్ పిన్‌రెడ్డి రాజిరెడ్డి ఇళ్ల వద్ద ఈ నెల 24న రెక్కీ నిర్వహించి 26న రాత్రి వెళ్లారు. మావోయిస్టుల లెటర్ ప్యాడ్‌లు చూపించి రెండు బొమ్మ పిస్టళ్లతో బెదిరించారు. మీరు మా టార్గెట్ లిస్ట్‌లో ఉన్నారని, చంపకుండా ఉండాలంటే మోహన్‌రెడ్డి రూ.50లక్షలు ఇవ్వాలని, అనంతరం రాజిరెడ్డి ఇంటికి వెళ్లి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరుసటి రోజున జనార్దన్, సతీష్, సమ్మయ్య మహాముత్తారం మండలం కోనంపేట క్రాస్‌రోడ్ వద్దకు వెళ్లి ఫోన్ చేసి రాజిరెడ్డిని డబ్బులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాజిరెడ్డి రాకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. 29వ తేదీన మోహన్‌రెడ్డిని కలిసి ఎలాగైనా డబ్బులు వసూలు చేయాలని సతీష్, జనార్దన్, నర్సయ్య కారులో, రాజేంద్రప్రసాద్, సమ్మయ్య బైక్‌పై కాళేశ్వరానికి వెళ్లారు. ఈ క్రమంలోనే పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఐదుగురు పట్టుబడ్డారు. వారినుంచి రెండు బొమ్మపిస్టళ్లు, నాలుగు జిలిటెన్ స్టిక్స్, ఒక కారు, ఐదు మొబైల్స్, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ సురేందర్‌రెడ్డి తెలిపారు. నిందితులను పట్టుకున్న మహదేవ్‌పూర్ సీఐ కిరణ్, కాళేశ్వరం ఎస్సై లక్ష్మణ్‌రావు, ఎస్సై భవాని సేన్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో కాటారం, భూపాలపల్లి డీఎస్పీలు రామ్మోహన్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యం

- కలెక్టర్ భవేష్ మిశ్రా
- అంబేడ్కర్ ఆశయ సాధనే సర్కారు ధ్యేయం
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి: అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఇల్లందు క్లబ్‌హౌస్‌లో ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్(ఈఎస్ఎస్)లో భాగంగా లబ్ధిదారులకు చిన్న యూనిట్ల పంపిణీ, మూడెకరాల భూ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి కలెక్టర్ తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, దళితుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చిన్న వ్యాపారాలు ప్రారంభించేందుకు తోడ్పాటు అందించడానికి ప్రభుత్వం 170మంది లబ్ధిదారులకు రూ.50వేల చొప్పున జిల్లాకు రూ.85లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం అందించిన సబ్సిడీతో లబ్ధిదారులు కోరిన విధంగా యూనిట్లు ఏర్పాటుచేసి అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందించిన సబ్సిడీతో లబ్ధిదారులు పలు రకాల దుకాణాలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. దళితులకు మూడెకరాల భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో ఎంపిక చేసిన 16మంది లబ్ధిదారులకు రూ.1.56కోట్ల విలువ గల 22.17ఎకరాల భూమిని కొనుగోలు చేసి పూర్తి ఉచితంగా పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం కేసీఆర్ హైదరాబాద్ నడిబొడ్డున నిర్మించారన్నారు. మన రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిన సచివాలయ భవనానికి సైతం అంబేడ్కర్ పేరు పెట్టి వారి ఆశయాల సాధన దిశగా పని చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కేబినేట్ సమావేశంలో ప్రతీ నియోజకవర్గానికి 1,100 దళిత బంధు యూనిట్లను మంజూరు చేసిందన్నారు. త్వరలోనే లబ్ధిదారుల ఎంపిక చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి..

ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు జీవ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను సక్రమంగా పాటించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో జీవ వ్యర్థాల నిర్వహణ సంబంధించిన సమీక్ష కోసం జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మొదటి సమావేశాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అనుమతులు లేని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు నోటీసులు ఇవ్వాలని, నిబంధనలు పాటించని ఆస్పత్రులపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వరంగల్ కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారిణి సునిత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి..

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2023 సంబంధించి ధృవీకరణ పనులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2023పై శనివారం జిల్లా కేంద్రంలోని ప్రగతి భవన్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓ, ఎంపీఓలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు అంశాలను మన జిల్లాలోని ప్రతీ గ్రామంలో వంద శాతం అమలు చేస్తున్నామని అన్నారు. వీటిని పరిశీలించేందుకు కేంద్ర బృందాలు జూలై మాసంలో వచ్చే అవకాశం ఉందన్నారు. ఎంపీడీఓలు, ఎంపీఓలు క్షేత్రస్థాయిలో గ్రామాలలో తనిఖీలు నిర్వహించి ఏవైనా చిన్న, చిన్న లోపాలు ఉంటే సరి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ పురుషోత్తం, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి



దీక్షలో కూర్చున్న గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: పల్లెల అభివృద్ధికి అనునిత్యం కృషిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్), ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను (ఓపీఎస్) రెగ్యులరైజ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలకేంద్రంలో జేపీఎస్, ఓపీఎస్‌ల నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. జీఓ 26ప్రకారం కార్యదర్శులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, మొగుళ్లపల్లి టౌన్ ప్రెసిడెంట్ క్యాతరాజు రమేష్, మండల మాజీ కో ఆపరేటివ్ చైర్మన్ పోలినేని లింగారావు, చిట్యాల మాజీ జెడ్పీటీసీ ఒరం సమ్మయ్య, నాయకులు నడిగోటి రాము, రఫీ, ఒనపాకల ప్రసాద్, ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

డార్విన్ సిద్ధాంతం తొలగింపు సరికాదు



మాట్లాడుతున్న కోట రమేష్

భూపాలపల్లి అర్బన్: విద్యారంగంలో డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం సరైనది కాదని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని శ్రామిక భవనంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలతో విద్య కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేసి యువకులను ఉన్మాదులుగా తయారు చేసి అజ్ఞానంవైపు నడిపిస్తున్నట్లు ఆరోపించారు. సైన్స్ పాఠాలు లేకపోతే దేశం మూఢత్వం వైపు నడుస్తుందన్నారు. సైన్స్ చరిత్రను, వాస్తవాలను మళ్లీ పాఠాలలో పునరుద్ధరణ చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుల వినయ్, శ్రీకాంత్, నవీన్, ప్రవీణ్, స్వర్ణలత, కవిత, నీలిమ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చెక్ పోస్టు తనిఖీ

వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టును శనివారం అధికారులు తనిఖీ చేశారు. ఓఎస్డీ ప్రభాకర్, డీసీఎస్ఓ అరవింద్ రెడ్డి, డీఎమ్ సీఎస్ఏ రాములు, డీటీ సీఎస్ రామచందర్ నేరుగా చెక్ పోస్టు వద్దకు చేరుకున్నారు. ముందుగా రికార్డులను చూశారు. అధికారులు పక్కాగా చెక్ పోస్టు వద్ద ఉండాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. వరి ధాన్యం తరలింపుపై గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు.

వస్త్ర వ్యాపార మోసాలపై విచారణ చేపట్టాలి



షాప్‌లో అమ్ముతున్న నకిలీ పోచంపల్లి చేనేత చీరను చూపిస్తున్న దాసు సురేశ్

నయీంనగర్: చేనేత వస్త్రాలంటూ మిల్లు వస్త్రాలపై నేసిన చీరలను అమ్ముతున్న వస్త్ర వ్యాపార సంస్థల మోసాలపై సీబీఐ విచారణ చేపట్టాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సురేశ్ మాట్లాడుతూ.. నగరంలోని ఓ మాల్ చేనేత చీరలకు బదులు మోసపూరితంగా మిల్లు వస్త్రాలు అమ్ముతూ అధికారులకు దొరకిపోయిందన్నారు. అనేక ఆఫర్లతో మహిళలను మోసగిస్తూ, ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని నగర ప్రజలు గమనించాలన్నారు. కొనుగోలుదారులు చేనేత వస్త్రాలు అసలువో, నకిలీవో సరిచూసుకోవాలని కోరారు. చేనేత కార్మికుల సంక్షేమార్థం కొనసాగుతున్న ఈ పోరాటంలో దోషులు ఎంతటి వారైనా వదిలేది లేదని సురేశ్ హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఆడేపు నగేశ్, పాదిల రాజు, మడత కిషోర్, పాదిల సాయిబాబా, అన్నరాజు, బగ్గిరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రమేశ్, ఆచార్యులు

కేయూ క్యాంపస్: కేయూలోని బయోటెక్నాలజీ విభాగం, యునైటెడ్ కింగ్‌డమ్ లోవెల్స్‌లోని అబెర్యస్ట్విత్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 27 నుంచి 28వరకు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈమేరకు శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సైన్స్ డీన్ పి.మల్లారెడ్డి, విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీనివాస్ అడ్జెంట్ ఆచార్యులు ఎ.సదానందం, ఆచార్య ఎస్.రాంరెడ్డి, ఆచార్య ఎన్.రామస్వామి, అధ్యాపకులు డాక్టర్ టి.శాస్త్రి, డాక్టర్ రాధిక, డాక్టర్ మహేందర్, డాక్టర్ రజనీకాంత్, భకత్, ఫణికాంత్ విశ్రాంత ఆచార్యులు పి.కృష్ణమాచార్య, క్రిస్టోఫర్, వి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బైక్.. భద్రం బ్రదరూ!

- రెక్కీ వేసి.. క్షణాల్లో చోరీ
- ఈజీ మనీ కోసం కొందరి తప్పుదారి
- బైక్‌పోతే రికవరీ కష్టం
- కనీస జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు

> ఈనెల 28న వరంగల్ 39వ డివిజన్ లక్ష్మినగర్‌కు చెందిన కుల్ల నాగరాజు ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. నాగరాజు గురువారం రాత్రి బైక్‌ను పార్క్ చేసి నిద్రకు ఉపక్రమించాడు. శుక్రవారం తెల్లవారుజామున లేచి చూసే సరికి కనిపించలేదు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఖిలా వరంగల్: నగరంలోని రద్దీ మార్గాలు, శివారు కాలనీల్లో బైక్ దొంగలు రెచ్చిపోతున్నారు. ఇళ్లు, వ్యాపార సముదాయాలు, ఆస్పత్రులు, రెస్టారెంట్లు, రద్దీ ప్రాంతాల్లో ఎక్కువగా వాహన చోరీలు జరుగుతున్నాయి. మద్యానికి బానిసైన యువత పార్క్ చేసి ఉంచిన బైక్, ఆటో, కారును రెప్పపాటులో మాయం చేస్తున్నారు. ఈఘటనలు వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌తోపాటు వరంగల్ ట్రిసిటీవ్యాప్తంగా కొన్నాళ్లుగా ఎక్కువగా జరుగుతున్నాయి. రహదారుల మీద, ఇంటి ఎదుట పార్క్ చేసిన ద్విచక్రవాహనాలు అనేకం మాయమవుతున్నాయి. రాత్రి వేళల్లో ఇంటి ఎదుట నిలిపి తర్వాతి రోజు ఉదయం చూసే సరికే వాహనాలు కనిపించట్లేదు. కాగా దొంగలు ఎత్తుకెళ్లిన ద్విచక్రవాహనాలు మధ్యతరగతి వారివే. ప్రస్తుతం బైక్ కొనాలంటే రూ.లక్షకు పైగా వెచ్చించాల్సి వస్తోందని వారంతా వాపోతున్నారు.

పట్టపగలే మాయం..

నగర రహదారులకు ఇరువైపులా పార్క్ చేసి షాపుల్లోకి వెళ్లడం, ఇంటి ఎదుట పార్కు చేసి ఇళ్లలోకి వెళ్తుంటారు. తిరిగి వచ్చి చూసే సరికి బైక్ కనిం చదు. ఇటీవల వరంగల్ తూర్పు, శివనగర్, కరీమాబాద్, ఫోర్ట్ రోడ్డు, చింతల్, శాంతినగర్, మిల్స్ కాలనీ, తెలంగాణ జంక్షన్ రహదారులపై ద్విచక్ర వాహనాలు ఎక్కువగా మాయమవుతున్నాయి. వరంగల్ ట్రిసిటీకి గ్రామీణ ప్రాంత ప్రజలతోపాటు నగర ప్రజల వివిధ అవసరాల కోసం షాపింగ్‌కు వస్తుంటారు. రహదారులపై వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. ఇటీవలి కాలంలో రద్దీగా ఉండే ప్రాంతాలను దొంగలు ఎంచుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు.

ఖరీదైన బైక్‌లపై కన్ను..

కొందరు యువత వ్యసనాలకు బానిసై, ఈజీ మనీకి అలవాటై బైక్ చోరీలకు పాల్పడుతున్నారు. పగలంతా రెక్కీ వేసి రాత్రిళ్లు పార్క్ చేసిన బైక్‌లను ఎత్తుకెళ్తున్నారు. యువకులు ఎంతో ఇష్టంగా కొంటున్న స్పోర్ట్స్, ఇతర బ్రాండ్ కంపెనీల బైక్‌లపై దొంగలు కన్నేస్తున్నారు. వాటిని చోరీ చేసి వేరే వాళ్లకు విక్రయిస్తూ, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ.. చోరీ చేసిన వాహనాన్ని విడి భాగాలను రాత్రికి రాత్రే స్క్రాప్‌కు అమ్మేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా రాత్రి సమయంలో ఎక్కువగా చోరీలు జరుగుతున్నాయి. ఇంటి ఎదుట వాహనం నిలపాలంటేనే భయపడాల్సిన పరిస్థితి. పోలీసుల గస్తీ తక్కువగా ఉండడంతోనే దొంగలు చెలరేగుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

వాహనం పోయిన తర్వాత పోలీసులను ఆశ్రయించడం కంటే ఎవరికి వారు జాగ్రత్తలు పాటించాలి. వాహనానికి ఉండే తాళంతో పాటు చక్రాలకూ తాళాలు వేస్తే కొంతవరకు ప్రయోజనం ఉంటుంది. తాళం పడిందో లేదో ఒకటికి రెండు సార్లు సరి చూసుకోవాలి. రోజుల తరబడి వాహనాన్ని వదిలేసి ఉంచకూడదు. ముఖ్యంగా ఇంటి ఎదుట వాహనం పార్కింగ్ చేస్తే కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. దీనిపై మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. బైక్ దొంగలను గుర్తించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీల్లో నిఘా పెంచామని, షాపులు, ఇళ్ల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

వాహన రికవరీలేవి?

వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి వాహనాలు మాయమైన కేసుల దర్యాప్తులో రోజులు గడుస్తున్నా పురోగతి ఉండడం లేదని బాధితులు వాపోతున్నారు. మరో వైపు ముఖ్యమైన కేసులు దర్యాప్తులు, బందోబస్తు, కార్యక్రమాలంటూ పోలీసులకు విధులు ఉండడంతో చిన్నపాటి కేసులు దర్యాప్తు ముందు సాగని పరిస్థితి నెలకొంది. ఈస్టేషన్ నిత్యం రద్దీగా ఉండడంతో వాహన చోరీ కేసులను ఛేదించలేకపోతున్నట్లు తెలుస్తోంది.



వరంగల్ ఫోర్ట్‌రోడ్డుపై షాపులు, ఇళ్ల ఎదుట నిలిపిన వాహనాలు

కొన్ని చోరీలు ఇలా..

- వరంగల్ శివనగర్ పల్లవి ఆస్పత్రి లేన్‌లో నివాసం ఉండే ఓవ్యక్తి ఇటీవల ఒక రోజు సాయంత్రం ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌కు లాక్ చేసి ఇంట్లో నిద్రించాడు. మరుసటి రోజు ఉదయం చూసే సరికే ఖరీదైన బైక్ కనిపించలేదు. చేతిలో బైక్ లేక ఉపాధి కోల్పవడంతో కన్నీరుమున్నీరయ్యాడు.
- వరంగల్ చింతల్ మైసమ్మ గుడి ప్రాంతానికి చెందిన ఎండీ.హైమద్ ఈనెల 19న వరంగల్ రైల్వే స్టేషన్ శివనగర్‌వైపు బైక్ నిలిపి, రైల్వేస్టేషన్ క్యాంటీన్‌కు వెళ్లి కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి చూడగా.. వాహనం కనిపించలేదు. లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.
- కరీమాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి అదే ప్రాంతంలో బంధువుల ఇంటి ఎదుట పార్కింగ్ చేసి పైఅంతస్తుకు వెళ్లి కొద్దిసేపటి తర్వాత కిందికి వచ్చి చూడగా బైక్ మాయమైంది.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడి మృతి



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం కమలాపూర్‌లో బుధవారం తాటిచెట్టు పైనుంచి కింద పడిన గీత కార్మికుడు గట్టు భిక్షపతి(35) వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన భిక్షపతి మృతితో కుటుంబం ఆధారం కోల్పోయింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని కుటుంబానికి ఆర్థిక చేయూతనందించాలని కమలాపూర్ గౌడ సంఘం అధ్యక్షుడు పాలకుర్తి వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి బుడిగ అశోక్, గ్రామస్తులు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎస్‌ఆర్ విజయకేతనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఎస్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు

హన్మకొండ చౌరస్తా: దేశంలోకెల్లా అత్యంత ప్రతిష్టాత్మకమైన జేఈఈ(మెయిన్)–23 ప్రవేశానికి శనివారం వెలువడిన ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థులు అద్భుతమైన ర్యాంకులతో సత్తా చాటి విజయకేతనం ఎగురవేశారని ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ కాకాజీ కాలనీలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫలితాల వివరాలు వెల్లడించారు. తమ విద్యార్థులు బి.సమీత్ జాతీయ స్థాయిలో రిజర్వేషన్ కేటగిరీలో 7వ ర్యాంకు, సాత్విక్ 20వ ర్యాంకు, చవాన్ అఖిల 22వ ర్యాంకు, శ్రీవర్షిత్ 34వ ర్యాంకు, కొడారి కార్తీక్ 44, ధరావత్ సాయిధీరజ్ 48, బానోత్ చరణ్ 92, బానోత్ నితీశ్ 109, షేక్ అబ్దుల్ సమీర్ 118, పృథ్వీరాజ్ తేజావత్ 167, బి.హార్దిక్ 167, సి.సోనిక 203, ఎండి.మొయినొద్దీన్ 215, నవీన్‌కుమార్ 232, పెండెం శ్రీకరి 322, మణిదీప్‌రెడ్డి 324, పి.నర్మద 357 ర్యాంకులను సాధించారని హర్షం వ్యక్తం చేశారు. వీరితో పాటు జేఈఈ అడ్వాన్స్‌డ్–2023కు ఇప్పటి వరకు 2,786కి పైగా ప్రవేశానికి విద్యార్థులు అర్హత సాధించి ఎస్ఆర్ కీర్తి ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలబెట్టినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరింత అత్యుత్తమైన మార్కులు సాధించేలా తీర్చిదిద్దుతామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యా బోధన, ఉన్నతమైన ఫ్యాకల్టీతో ఈ విజయాలను సాధించగలిగామన్నారు. ఈసమావేశంలో ఎస్ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐపీఎస్ అవుతా..



జాతీయ స్థాయిలో 7వ ర్యాంకు సాధించడం నా కెరీర్‌లో ఓ మైలురాయి. ఇదే స్ఫూర్తితో సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించి ఐపీఎస్ కావడమే లక్ష్యం. సింగిల్ డిజిట్ ర్యాంక్ రావడం వెనకాల ఉపాధ్యాయులైన మా అమ్మా నాన్నలు రాములు, అరుణ ప్రోత్సాహం మరువలేనిది.

– సమీత్, పైడిపెల్లి

ఫేస్‌బుక్ సీఈఓ అవడమే లక్ష్యం



జేఈఈ మెయన్ ఫలితాల్లో 20వ ర్యాంకు రావడం వెనుక మా అధ్యాపకుల బోధన, మాకు నేర్పిన క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసమే కారణం. ఎస్ఆర్ కాలేజీ నేర్పించిన పట్టుదల, విద్యతో భవిష్యత్‌లో ఫేస్‌బుక్ సీఈఓ కావడమే లక్ష్యంగా సాఫ్ట్‌వేర్‌పై పట్టు, నైపుణ్యాలపై శిక్షణ తీసుకుంటా.

– సాత్విక్, వికాస్‌నగర్

ఐటీ రంగంలో రాణిస్తా..



జేఈఈ (మెయిన్) ఫలితాల్లో 357వ ర్యాంకు సాధించడం మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది. మా అధ్యాపకుల బోధన, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించా. ఐటీ రంగంలో రాణించడమే లక్ష్యంగా చదువు కొనసాగిస్తా.

– నర్మద, వడ్డేపల్లి

కృష్ణవేణి జయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణవేణి యజమాన్యం, సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: జేఈఈ మెయిన్స్–2 ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపుడి జగదీశ్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని కళాశాలలో శనివారం వారు విద్యార్థులను అభినందించి మాట్లాడారు. తమ విద్యార్థులు బి.అరవింద్ 54, టి.నేహా శ్రీ 186, ఎస్.కే.సుభానీ 280, టి.జనేష 367, ఎస్.వెంకట సాయితేజ 472, టి.పవన్ 823, డి.మనోజ్ 897, పి.రవిశంకర్ 1,201, బి.కల్యాణ్ 1,357, బి.కిరణ్ 1,535, బి.బాబా 1,596, జె.సోని 1,957, నిఖిల శ్రీ 2,197, ఆర్.చంటి 2,229, బి.యశ్వత 2,864, కె.అనుశ్రీ 3,143, బి.అమిత 3257, బి.మహేశ్ 3,363, జి.చైతన్య 3,365, పి.అస్మిత 3,593, బి.తులసి ప్రియ 3,614, బి.శివ రామకృష్ణ 4,149, జి.దేవేందర్, 4,187, బి.కార్తీక్ 4,502, సిరిబాయి 4,556, జి.సిద్ధు 4,851 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపాల్ గుర్రం రామచంద్రయ్య, అకాడమిక్ డీన్ శేఖర్‌బాబు, ఇన్‌చార్జ్ వంశీకృష్ణ, ఏఓ నిరంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'రెజోనెన్స్' ప్రతిభ




ర్యాంకులు సాధించిన విద్యార్థులతో రెజొనెన్స్ విద్యా సంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి, డైరెక్టర్లు

హన్మకొండ: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తాజాగా ప్రకటించిన జేఈఈ మెయిన్స్–23 రెండో సెషన్ ఫలితాల్లో హనుమకొండలోని రెజోనెన్స్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు. తమ విద్యా సంస్థల విద్యార్థులు ఎప్పటిలాగే.. ఈసారి కూడా మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు. జి.రామకృష్ణ, 99.99 పర్సంటైల్‌తో 115వ ర్యాంకు, జి. అభిషేక్ 99.98 పర్సంటైల్‌తో 258, ఏ.కావ్య 99 97 పర్సంటైల్‌తో 378, ఎస్.అపూర్వ 99, 97 పర్సంటైల్‌తో 390, జి. క్రితిన్ 99, 97 పర్సంటైల్‌తో 407, యం.నిహాల్ 99.81 పర్సంటైల్‌తో 415, అర్జున్ కృష్ణ 99.96 పర్సంటైల్‌తో 465, యాదా అక్షయ్ 99, 60 పర్సంటైల్‌తో 580, పి.అరవింద్ 97.78 పర్సంటైల్‌తో 911వ ర్యాంకు సాధించినట్లు రెజోనెన్స్ విద్యా సంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను శనివారం హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలోని రెజోనెన్స్ కాలేజీలో అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు లెక్కల మహేందర్‌రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సీఈఓ మునీందర్ ఇరుకుళ్ల, అకాడమిక్ డీన్ బీఎస్.గోపాలరావు పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనం జరగాలి

- ఎమ్మెల్సీ సురభివాణీదేవి



భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సురభివాణీదేవి, పక్కన వీసీ

కేయూ క్యాంపస్: పీవీ రాజనీతి, తాత్విక చింతన, ఆర్థిక సంస్కరణలు, దౌత్య సంబంధాలపై నిరంతరం అధ్యయనం జరగాలని భారత మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ సురభివాణీదేవి అన్నారు. శనివారం ఆమె కాకతీయ యూనివర్సిటీని సందర్శించారు. వీసీ రమేశ్‌తో పలు అంశాలపై ముచ్చటించారు. పీవీ జీవిత చరిత్ర, రాజకీయ జీవితం ఇతర అంశాలతోపాటు క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు పీవీ అమలు చేసిన వ్యూహాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. వీసీ రమేశ్ ఎమ్మెల్సీ సురభి వాణిని సత్కరించి జ్ఞాపిక, పూల బోకేను అందించారు.

ఆ భవనంలోనే పీవీ విజ్ఞాన పీఠం!

కేయూలో రెండో గేట్ సమీపంలో అడ్మిషన్ల డైరెక్టరేట్ కార్యాలయం కోసం రూ.1.60 కోట్లతో నిర్మించిన నూతన భవనంలోనే పీవీ విజ్ఞాన పీఠాన్ని కేయూ వీసీ తాటికొండ రమేశ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈమేరకు శనివారం ఎమ్మెల్సీ సురభివాణీదేవి, వీసీ ఈ భవనాన్ని పరిశీలించారు.

వైద్య విద్యార్థులకు బయోమెట్రిక్ తిప్పలు



ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో మెరుగైన సేవల కోసం రాష్ట్రంలో మొదటిసారి కేఎంసీకి అనుబంధంగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యవిద్యార్థుల కోసం బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. బయోమెట్రిక్ పరికరాన్ని పరిపాలన కార్యాలయంలోని బహిరంగ ప్రదేశంలో కాకుండా.. గతంలో ఏఓగా విధులు నిర్వర్తించిన ప్రత్యేక చాంబర్‌లో అమర్చారు. శనివారం ఉదయం 10:30 తర్వాత సైతం ఈచాంబర్ గది తాళం తీయకపోవడంతో క్లినికల్ విధులు నిర్వర్తించిన వైద్య విద్యార్థులు తమ బయోమెట్రిక్ విధానాన్ని నమోదు చేసేందుకు ఎదురుచూశారు.